క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం

నెల్లూరు (టౌన్): మహిళా సంరక్షణ, మానవ అక్రమ రవాణా, సైబర్ క్రైమ్ తదితరాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ రామారావు పేర్కొన్నారు. చట్టాలపై నగరంలోని ఓవెల్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. లైంగిక దాడులు, పోక్సో యాక్ట్, శక్తి యాప్, మాదకద్రవ్యాల వినియోగం, డయల్ 112 తదితరాలపై అవగాహన కల్పించారు. మహిళా పోలీస్ స్టేషన్ సీఐలు సుబ్బారావు, కృష్ణారెడ్డి, ఏఎస్సైలు శ్రీహరి, సతీష్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నెల్లూరు సిటీ: రూరల్ పరిధిలోని 17వ డివిజన్ వడ్డిపాళెంలో పలు అభివృద్ధి పనులకు సంబంధించిన శంకుస్థాపనను మంత్రి పార్థసారథి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శుక్రవారం చేపట్టారు. నేతలు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, రూప్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్సెన్నెల్ పెన్షనర్ల నిరసన ప్రదర్శన

నెల్లూరు(బృందావనం): పెన్షనర్స్ వేలిడేషన్ చట్టాన్ని రద్దు చేసి.. ఎనిమిదో వేతన కమిటీని వెంటనే నియమించాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శనను ఫోరం ఆఫ్ సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్స్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బీఎస్సెన్నెల్ పెన్షనర్లు శుక్రవారం నిర్వహించారు. సంస్థ నెల్లూరు కార్యాలయం నుంచి వీఆర్సీ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు ప్రదర్శన జరిపారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. నేతలు నాగేశ్వరరావు, సూర్యనారాయణ, జాన్ ఆంథోనీ, చంద్రమౌళి, శేఖర్‌బాబు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

పొట్టేపాళెం కలుజు వద్ద ధర్నా

నెల్లూరు సిటీ: పొట్టేపాళెం – ములుమూడి కలుజులపై బ్రిడ్జిలను వెంటనే నిర్మించాలని సీపీఎం నేతలు మూలం రమేష్, మాదాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పొట్టేపాళెం కలుజు వద్ద శుక్రవారం చేపట్టిన ధర్నాలో వారు మాట్లాడారు. చెరువులోని నీరు కలుజుపై ప్రవహిస్తుండటంతో వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారిందని, ఫలితంగా వారు ప్రమాదాలకు గురవుతున్నారని వివరించారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో యుద్ధప్రాతిపదికన నిర్మించాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఆలూరు తిరుపాల్, మండల కార్యదర్శి పూడిపర్తి జనార్దన్, నేతలు చంద్రమౌళి, గండవరపు శ్రీనివాసులు, ముత్యాల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

చట్ట విరుద్ధంగా మరోసారి గ్రామసభ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కరేడులో భూసేకరణపై గ్రామసభను రెండోసారి నిర్వహించతలపెట్టడం చట్ట విరుద్ధమని రైతు సంఘ జిల్లా కార్యదర్శి గంగపట్నం రమణయ్య ఆరోపించారు. సంతపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. కరేడులో భూములను ఇండోసోల్ కంపెనీకి కట్టబెట్టేందుకు గ్రామసభను ఈ నెల నాలుగున నిర్వహించారని, అయితే వీటిని ఇచ్చేందుకు రైతులు నిరాకరించారని చెప్పారు. ఎలాగైనా సేకరించాలనే ఉద్దేశంతో శనివారం మరోసారి నిర్వహించేందుకు సమాయత్తం కావడం చట్ట విరుద్ధమన్నారు. రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు షానవాజ్, శిరీషా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు మద్దతు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలో పారిశుద్ధ్య పనులను ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు పిలుస్తున్న టెండర్లను రద్దు చేయాలనే డిమాండ్‌తో నిరసన చేపట్టిన మున్సిపల్ కార్మికులకు ప్రజాసంఘాలు మద్దతిస్తున్నాయని రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్ర రాజగోపాల్, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు వెంకమరాజు పేర్కొన్నారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం వారు మాట్లాడారు. పీ4 పేరుతో పేదలను ధనవంతులను చేస్తామని సీఎం చంద్రబాబు చెప్తున్నారని, అయితే దళిత, గిరిజనులైన మున్సిపల్ కార్మికుల పొట్టగొట్టేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శివకుమారి, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరసింహ, రమణ, ఆవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఇరుగాళమ్మ సబ్‌స్టేషన్ పరిధిలో గల శాంతినగర్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ తెలిపారు. శాంతినగర్, బట్వాడిపాళెం సెంటర్, రామయ్యబడి వీధి, ఏసీబీ కార్యాలయం తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని వివరించారు.

శ్రావణం.. శుభకరం



మూలస్థానేశ్వరాలయంలో విశేషాలంకారం



ఇరుకళల పరమేశ్వరి దేవస్థానంలో..

నెల్లూరు(బృందావనం): శ్రావణమాస తొలి శుక్రవారాన్ని పురస్కరించుకొని జగన్మాతకు భక్తులు ప్రణమిల్లారు. ఆలయాలకు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని తన్మయత్వం చెందారు.

• రాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారు రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చారు. అంతరాలయంలో పూలంగిసేవను నిర్వహించారు. సామూహిక లక్ష కుంకుమార్చనను జరిపారు. పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకుడు సూరావఝుల రఘురామ్మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉభయకర్తలుగా పల్లపు రోషన్, శోభ దంపతులు వ్యవహరించారు. వేదపారాయణం, సంధ్యామేళం, కుంభహారతులు, పల్లకీసేవను నిర్వహించారు. ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

• సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి విశేష పూజలను నిర్వహించారు. చందనాలంకారం, పూలంగిసేవ, పల్లకిసేవను జరిపారు. ఉభయకర్తలుగా నాగరాజు, అనూరాధ, రాజేశ్వరరావు, అరుణ దంపతులు వ్యవహరించారు. ఈఓ విరుపావఝుల గిరికృష్ణ పర్యవేక్షించారు.

• బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో సీతా, మహాలక్ష్మి అమ్మవారికి సామూహిక కుంకుమపూజ, పల్లకిసేవను నిర్వహించారు. అమ్మవారు ఆదిలక్ష్మిగా కొలువై పసుపు కొమ్ములతో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా ఘంటసాల రేవతికుమార్, ఉషారాణి దంపతులు వ్యవహరించారు. మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తన్నీరు మస్తాన్‌రావు, సోమిశెట్టి వెంకటరత్నం, కోశాధికారి కొప్పవరపు శివప్రసాద్, అమరా మోహన్‌రావు తదితరులు పర్యవేక్షించారు.

• స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చారు. లక్ష కుంకుమార్చనను వాసవీ మహిళా సంఘ ఆధ్వర్యంలో 350 మంది మహిళలతో నిర్వహించారు. పూలంగిసేవను జరిపారు. ఉభయకర్తలుగా రవ్వ చిన్నసుబ్బారావు, భాగ్యలక్ష్మి, వెంకట కృష్ణచైతన్య, శుభశ్రీ దంపతులు వ్యవహరించారు. దేవస్థాన పాలకమండలి చైర్మన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షుడు శేగు షణ్ముఖరావు, కార్యదర్శి నిచ్చెనమెట్ల చిరంజీవి, కోశాధికారి ఉమ్మెన జనార్దన్, ఉపాధ్యక్షుడు వేముల ప్రసాద్, సహాయ కార్యదర్శి మునగా వెంకటేశ్వర్లు, గౌరవ సలహాదారుడు ఆంజనేయులు పర్యవేక్షించారు.

• మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరాలయంలో విశేష పూజలను నిర్వహించారు.



హాజరైన భక్తులు



రాజరాజేశ్వరి ఆలయంలో లక్ష కుంకుమార్చన

ప్రతిభ పురస్కారాల ప్రదానం రేపు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన గౌడ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను పురమందిరంలో ఆదివారం అందజేయనున్నామని నెల్లూరు జిల్లా గౌడ కల్లుగీత పారిశ్రామికుల సంఘం, గౌడ సేవా సమితి అధ్యక్షుడు తోట ప్రభాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కోసూరు రాజశేఖర్ పేర్కొన్నారు. సుజాతమ్మ కాలనీలో విలేకరులతో శుక్రవారం వారు మాట్లాడారు. 450 మార్కులకుపైగా సాధించిన 191 మంది విద్యార్థులకు బహుమతులను అందజేయనున్నామని వివరించారు. గౌడ సంఘీయులు భారీగా హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నడవడి ముత్యంగౌడ్, ఉప్పాల రామకృష్ణయ్య, రావుల రంగయ్య, దద్దోలు రామచంద్రయ్య, తాతా సుబ్బారావు, నిమ్మల మల్లికార్జున్, పెంచలయ్య, మారుబోయిన జనార్దన్, నిమ్మల సుబ్బయ్య, పాతపాటి సుబ్బానాయుడు తదితరులు పాల్గొన్నారు.

చీటింగ్ కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): కారును కుదువ పెట్టి నగదు తీసుకొని.. బాడుగ పేరిట తిరిగి తీసుకెళ్లిన వ్యక్తిపై చీటింగ్ కేసును చిన్నబజార్ పోలీసులు శుక్రవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కోటమిట్టకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సాబీర్ వద్ద అభినవ్ అనే వ్యక్తి తన బంధువుల కారును గతేడాది కుదువపెట్టి రూ.2.5 లక్షలను తీసుకున్నారు. అనంతరం బాడుగకు వెళ్తొస్తానంటూ కారును నమ్మకంగా తీసుకెళ్లి తన బందువులకు అభినవ్ ఇచ్చేశారు. దీనిపై సాబీర్ పలుమార్లు నిలదీయగా, త్వరలోనే చెల్లిస్తానని చెప్పారు. రోజులు గడుస్తున్నా, ఎలాంటి సమాధానం చెప్పకుండా.. నగదు చెల్లించకుండా కాలయాపన చేస్తూ వచ్చారు. ఇటీవల బాధితుడు గట్టిగా నిలదీయడంతో బెదిరింపు చర్యలకు దిగారు. సాబీర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ రీజినల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావును నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

నెల్లూరు (టౌన్): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కార్డియాలజిస్ట్ భక్తవత్సలరెడ్డి, కంటి వైద్య నిపుణుడు కిరణ్‌కుమార్, ఫిజియోథెరపిస్ట్ యుగంధర్ పేర్కొన్నారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 500కుపైగా మార్కులు సాధించిన దర్గామిట్టలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను స్పందన ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తాము ఇదే పాఠశాలలో చదువుకొని ఈ స్థాయిలో ఉన్నామన్నారు. స్పందన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాగేశ్వరరావు, నరేంద్ర, డిప్యూటీ డీఈఓ వెంకటేశ్వరనాయక్, ఎంఈఓ మురళీధర్, హెడ్‌మాస్టర్ కృష్ణారెడ్డి, పీఈటీ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్కుల్లో వసతులు కల్పించాలి

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని పార్కుల్లో వ్యాయామ పరికరాలు తదితర మౌలిక వసతులను కల్పించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. 52వ డివిజన్ రంగనాయకులపేటలోని పినాకినీ పార్కును శుక్రవారం సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. పార్కులను అభివృద్ధి చేసి త్వరితగతిన అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. అనంతరం కుక్కలగుంటలోని నగరపాలక సంస్థ వెహికల్ షెడ్డును తనిఖీ చేశారు. అవసరమైన మేరకు మరమ్మతులను వెంటనే పూర్తి చేయించాలని పేర్కొన్నారు. డీఈ రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

• ప్రాపర్టీ ట్యాక్స్ ఆటో మ్యుటేషన్ విధానంపై ప్రజలకు అవగాహన కల్పించి.. పన్నుల చెల్లింపు ప్రక్రియను సరళీకృతం చేయాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. ట్యాక్స్ మ్యుటేషన్‌పై రెవెన్యూ విభాగాధికారులు, ఇన్‌స్పెక్టర్లు, వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులకు శిక్షణ తరగతులను కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. నూతన విధానం ద్వారా టైటిల్ ట్రాన్స్‌ఫర్ కోసం ప్రజలు మున్సిపల్ కార్యాలయాలు, సచివాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదని చెప్పారు. ఆస్తి రిజిస్ట్రేషన్ జరిగే సమయంలోనే యజమాని పేరు మున్సిపల్ రికార్డుల్లో మారుతుందన్నారు. జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, సబ్ రిజిస్ట్రార్లు సుమలత, భానుమతి, ప్రవీణ, సింహాద్రి, రెవెన్యూ అధికారులు సమద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

• నగరంలోని వివిధ ప్రాంతాల్లో స్మార్ట్ స్ట్రీట్ బజార్ల ఏర్పాటుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని.. నిర్దేశించిన చోటే వీటిని సాగించేలా అధికారులు పర్యవేక్షించాలని కమిషనర్ నందన్ సూచించారు. టౌన్ వెండింగ్ కమిటీ సభ్యులతో కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాఫర్ సాహెబ్ కాలువ ప్రాంతంలో 200 దుకాణాలను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. టీపీఆర్వో శ్రీలక్ష్మి, ట్రాఫిక్ పోలీసులు రామకృష్ణ, వెంకటరెడ్డి, ఎంహెచ్ఓ కనకాద్రి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మురళి, ఫుడ్ సేఫ్టీ అధికారులు నీరజ, ప్రణతి తదితరులు పాల్గొన్నారు.

• నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో అనధికార, అక్రమ నిర్మాణాలను గుర్తించి వాటి యజమానులకు నోటీసులను జారీ చేయాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పట్టణ ప్రణాళిక విభాగాధికారులు, వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. హిమబిందు, డిప్యూటీ డైరెక్టర్ మాధురి, ఏసీపీ వేణు, టీపీఓ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ ముక్త్ భారత్‌లో భాగస్వాములవ్వాలి

నెల్లూరు(అర్బన్): టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లను నిర్వహించే డాక్టర్లు భాగస్వాములవ్వాలని ఏడీఎంహెచ్ఓ, జిల్లా టీబీ నివారణాధికారి ఖాదర్‌వలీ కోరారు. జాతీయ క్షయ నివారణ కార్యక్రమంలో భాగంగా నగరంలోని అమృత చెస్ట్ ఆస్పత్రి, జీకే హాస్పిటల్, జయచంద్ర నర్సింగ్ హోమ్‌లను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయా ఆస్పత్రుల్లో గుర్తించిన టీబీ రోగుల వివరాలను ఆరాతీసిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వచ్చే రోగుల్లో టీబీ లక్షణాలను గుర్తిస్తే వారిని ప్రభుత్వ టీబీ ఆస్పత్రికి సిఫార్సు చేయాలని కోరారు. పబ్లిక్, ప్రైవేట్ మిక్స్.. భవ్య సంస్థ కోఆర్డినేటర్లు హరీష్, తులసీరామ్, ఫీల్డ్ కో ఆర్డినేటర్ సరిత, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

ఐవీఎఫ్ కేంద్రాల్లో తనిఖీలు

నెల్లూరు(అర్బన్): ఐవీఎఫ్, సరోగసీ, ఏఆర్టీ క్లినిక్‌లపై అవగాహన కలిగి ఉండాలని డీఎంహెచ్ఓ సుజాత సూచించారు. ప్రపంచ ఐవీఎఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని పలు ఐవీఎఫ్ సెంటర్లను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. వారు అందిస్తున్న సేవలు, రికార్డులను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. ఆహార అలవాట్లను మార్చుకోవడం, డాక్టర్ల సూచనలను పాటించడం ద్వారా సహజ గర్భధారణ పొందొచ్చని చెప్పారు. ప్రభుత్వ నిబంధనలను ఐవీఎఫ్ కేంద్రాల నిర్వాహకులు తప్పక పాటించాలని సూచించారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఉమామహేశ్వరి, డెమో అధికారి కనకరత్నం, డిప్యూటీ హెచ్ఈఓ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ ఉపసంహరణకు డిమాండ్

నెల్లూరు(అర్బన్): ఉలవపాడు మండలంలోని కరేడులో ఇండోసోల్ సోలార్ కంపెనీ కోసం ప్రభుత్వం సేకరించనున్న భూసేకరణ ప్రక్రియను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కలెక్టరేట్లో డీఆర్వో హుస్సేన్‌సాహెబ్‌కు వినతిపత్రాన్ని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మూలం రమేష్, నేత మాదాల వెంకటేశ్వర్లు తదితరులు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడారు. భూసేకరణకు వ్యతిరేకంగా 3500 మంది రైతులు అర్జీలను ఇచ్చారని, ఇంత వ్యతిరేకత ఉన్నా, ప్రభుత్వం కుట్రపన్ని మరోసారి గ్రామసభ నిర్వహించేందుకు పూనుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. తొలుత నిర్వహించిన గ్రామసభ తీర్మానాన్నే అమలు చేయాలని డిమాండ్ చేశారు. భూములను అప్పగిస్తే వాటిపై ఆధారపడిన చిన్న, సన్న కారు రైతులతో పాటు వ్యవసాయ కూలీలు 15 వేల మంది రోడ్డున పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా భూసేకరణ ప్రక్రియను ఆపకపోతే అన్ని పార్టీలు, ప్రజలతో కలిసి ఉద్యమాలు సాగిస్తామని స్పష్టం చేశారు.

రక్తదాన మోటివేటర్‌కు అభినందన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రక్తదానంపై విస్తృత ప్రచారం చేస్తున్న మోటివేటర్, రక్తదాత అరిగెల సాయిని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ శుక్రవారం అభినందించారు. సైకిల్ యాత్రను చేపట్టిన ఆయనకు అభినందనలను తెలియజేశారు. బలరామయ్యనాయుడు, తిరుపతి శేఖర్, తిరుపతినాయుడు, వెంకటేశ్వర్లుగౌడ్, రఘురామ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రజక సంఘ జిల్లా కమిటీ సమావేశం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): గత ఎన్నికలకు ముందు కూటమి నేతలిచ్చిన హామీ మేరకు రజకులకు సామాజిక రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య డిమాండ్ చేశారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రజక సంఘ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 13 నెలలవుతున్నా, నేటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. సామాజిక రక్షణ చట్టం సాధన కోసం రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్ల వద్ద ధర్నాలను వచ్చే నెల 25న నిర్వహించనున్నామని వెల్లడించారు. అనంతరం ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. నేతలు అంకయ్య, సురేంద్ర, వెంకటేశ్వర్లు, కొండయ్య, కృష్ణ, వెంకటసుబ్బయ్య, మస్తానయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్రంలో వడ్డెర కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి.. రూ.వెయ్యి కోట్లను కేటాయించాలని వడ్డెర వృత్తిదారుల సంఘ రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ డిమాండ్ చేశారు. నగరంలోని భవన నిర్మాణ కార్మిక సంఘ జిల్లా కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. వడ్డెర వృత్తిదారుల మొదటి రాష్ట్ర మహాసభలను ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఏనుగు సుందరరామిరెడ్డి ఆడిటోరియంలో ఆది, సోమవారాల్లో నిర్వహించనున్నామని, భారీగా తరలిరావాలని కోరారు. వివిధ అంశాలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నేతలు వెంకటేష్, బాలవెంకటేశ్వర్లు, మల్లి, నాగార్జున, కృష్ణయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రగడ కోటయ్య జయంతి నేడు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ప్రజాబంధు ప్రగడ కోటయ్య జయంతిని జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న మనం హాస్పిటల్ ప్రాంగణంలో శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నామని చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా కన్వీనర్ బుధవరపు బాలాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీగా తరలిరావాలని కోరారు.